తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
28 జూన్ 2026
Follow :



# నర్సింగ్ అధికారినిగా గిరిజన మహిళ ఎంపిక

### పట్టుదలకు దక్కిన ప్రతిఫలం

**ధారూర్ జూన్ 27 (జనంసాక్షి)**
మండల పరిధిలోని మైలారం గ్రామపంచాయతీ వెంకట తండాకు చెందిన లవద్య అనిత ఇటీవల విడుదల చేసిన నర్సింగ్ ఉద్యోగానికి ఎంపిక అయ్యింది.ఆర్థిక కుటుంబ కష్టాలను ఎదుర్కొంటూ తన లక్ష్యాన్ని వదలకుండా నిరంతరం శ్రమించిన ఎల్.అనిత నర్సింగ్ అధికారినిగా ఎంపికై ఆదర్శంగా నిలిచారు.చిన్నప్పటి నుంచే సేవాభావంతో వైద్య రంగంలో పనిచేయాలనే లక్ష్యంతో కృషి చేసిన తన అంకితభావం మరియు పట్టుదలతో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు.ప్రతిరోజూ క్రమశిక్షణతో చదువుతూ ఎన్నో సవాళ్లను అధిగమించి పోటీ పరీక్షల్లో విజయం సాధించిన ఆమె ప్రస్తుతం నర్సింగ్ అధికారినిగా ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు.బంధువులు. గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని వదలకుండా కష్టపడితే విజయం మనదే.నా విజయానికి సహకరించిన కుటుంబ సభ్యులు. గురువులు స్నేహితులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కేజీబీవీ బాలికల కళాశాల ప్రారంభోత్సవం

### 4.15 కోట్లతో నిర్మించిన ఆధునిక విద్యా సముదాయం విద్యార్థినులకు అంకితం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**కోట్‌పల్లి, జూన్ 27 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండలం కరీంపూర్ గేటు సమీపంలో రూ.4.15 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించే అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. బాలికల విద్య సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, విద్యతోనే మహిళల సాధికారత సాధ్యమవుతుందని అన్నారు.



రూ.4.15 కోట్లతో నిర్మించిన ఈ నూతన కేజీబీవీ భవనంలో విశాలమైన తరగతి గదులు, వసతి గదులు, ఆధునిక వంటశాల, భోజనశాల, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు అధికారులు వివరించారు. ఈ భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించనున్నారని తెలిపారు.

అనంతరం స్పీకర్ విద్యార్థినులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలను బ్లాక్ మెయిల్ చేస్తున్న నిందితుడి అరెస్ట్



**శేరిలింగంపల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** సామాజిక మాధ్యమాల ద్వారా యువతులను మహిళలను, పరిచయం చేసుకొని తర్వాత సన్నిహితంగా స్నేహాన్ని మెయింటైన్ చేస్తూ దానిని ఆసరాగా తీసుకొని వారికి తెలియకుండా సన్నిహితంగా ఉన్న దృశ్యాలను వీడియోలు తీసి తదనంతరం వాటిని అడ్డం పెట్టుకొని బ్లాక్ మెయిలింగ్ కి పాల్పడుతూ డబ్బులు దండుకోవడం పరమావధిగా మార్చుకున్న ఓ నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి ఇన్స్పెక్టర్ బాలరాజు వెల్లడించిన కథనం ప్రకారం... కిలారి నాగ తేజ అలియాస్ నాని(24) సామాజిక మాధ్యమాలలో చాలా చురుకుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో స్నాప్ చాట్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతులు, మహిళలతో పరిచయం పెంచుకొని తదనంతరం వారితో చలువుగా ఉంటూ ప్రేమిస్తున్నానని నమ్మించి హోటళ్లు, ఇతర ఏకాంత ప్రదేశాలకు పిలిచి వారికి తెలియకుండా సన్నిహితంగా ఉన్న వీడియోలను చిత్రీకరించి ఆ తర్వాత తన స్వభావాన్ని మార్చుకొని వారిపై బ్లాక్మెయిలింగ్ పాల్పడి అందిన కాడికి డబ్బులు దండుకోవడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో అతడు చెప్పినట్టు వినని కొంతమంది బాధితులకు సంబంధించిన వీడియోలను సామాజిక ప్రసార మాధ్యమాలలో పెట్టి పైశాచిక ఆనందాన్ని పొందిన దాఖలాలు కూడా ఉన్నట్లు పోలీసు అధికారులు వివరించారు. తాజాగా ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు తమదైన కోణంలో దర్యాప్తును కొనసాగించి గచ్చిబౌలి పరిధి డిఎల్ఎఫ్ గేటు నెంబర్ 3 ఎదురుగా ఉన్న యెల్లో స్టోన్ హోటల్లోని రూమ్ నెంబర్ 101 లో సదరు మహిళలను బంధించి కత్తితో బెదిరించి నగ్న వీడియోలు చిత్రీకరించి తీవ్ర బహిభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సిఐ బాలరాజు మీడియాకు తెలియజేశారు. కాగా పలు సందర్భాలలో ఇప్పటికే ఆ మహిళ వద్ద నుండి లక్షా 10 వేల రూపాయలను వసూలు చేయడంతో పాటు మరికొంత డబ్బును ముట్ట చెప్పాల్సిందిగా వేధింపులకు పాల్పడుతుండడంతో తట్టుకోలేక గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించినట్లు విచారాలలో తేలిందని సీఐ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అనంతరం అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు.

# నరకప్రాయంగా ప్రయాణం

### తూంపల్లి బీటీ రోడ్డుపై పాలకుల నిర్లక్ష్యం
### గత ప్రభుత్వం తవ్వింది ఈ ప్రభుత్వం మరిచింది





**కొందుర్గు:జనంసాక్షి :** అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తమ సమస్యలను తీరుస్తుందని ఆశించిన ఆ గ్రామ ప్రజలకు నిరాశే మిగిలింది. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం నుండి జిల్లేడు చౌదరిగూడ మండలానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన బీటీ రోడ్డు పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనుల కోసం ఉన్న రోడ్డును తవ్వేసి వదిలేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పూర్తిగా విస్మరించిందని తూంపల్లి గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల మధ్య నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఈ బీటీ రోడ్డు పునర్నిర్మాణానికి నిధులు మంజూరై, పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉన్న పాత రోడ్డును పూర్తిగా తవ్వి వేశారు. అయితే పనులు పూర్తికాకముందే ప్రభుత్వం మారడంతో, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఈ రోడ్డు పనులను పట్టించుకోవడం మానేసింది. రోడ్డు తవ్వి అలాగే వదిలేయడంతో గుంతలు తేలి, రాళ్లు పైకి లేచి మార్గమంతా ప్రమాదకరంగా మారింది. తూంపల్లి గ్రామ ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాలన్నా, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే ఈ రోడ్డు మరింత ప్రమాదకరంగా మారి నడవడానికి కూడా వీల్లేకుండా పోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వం రోడ్డు తవ్వి సగం పనులు చేస్తే, ఈ ప్రభుత్వం అసలు ఆ ఊసే ఎత్తడం లేదు" అని తూంపల్లి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఈ రెండు మండలాల అనుసంధాన బీటీ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేసి తమ ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



# పిస్తా హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జూన్27(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ 123వ డివిజన్ హైదర్షాకోట్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, పిస్తా హౌస్ యాజమాన్యం, జీహెచ్ఎంసీ 120, 121, 123 డివిజన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, నేతలు పద్మావతి పాపయ్య యాదవ్, సుమన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వివేక్‌నగర్ బస్తీలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ



**ముషీరాబాద్, జూన్ 27 (జనం సాక్షి):** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్–8లో ఉన్న వివేకనగర్ బస్తీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ డిప్యూటీ కమిషనర్ పుష్పలత, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి పాల్గొని ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేశారు. ఎన్నికల జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, అవసరమైన పత్రాలతో ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ముచ్చకుర్తి పద్మ, సూపర్వైజర్ సత్యనారాయణ, బీఎల్వో అనిత, బీఎల్ఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క ఓటరు–బిఎల్వో లకు ఓటర్ వివరాలు అందించండి

### ఎన్యుమరేషన్ పత్రాలను అందజేసిన తహసిల్దార్ కే.రమేష్



**తలకొండపల్లి జూన్ 27(జనంసాక్షి):** ప్రతి ఒక్క ఓటరు బిఎల్వో లకు ఓటర్ వివరాలు కచ్చితంగా అందజేయాలని తలకొండపల్లి తహసిల్దార్ కే.రమేష్ పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా శనివారం తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో పర్యటించిన తహసిల్దార్ ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు సైతం భాగస్వాములయ్యేల కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేయాలని బిఎల్ఓ లను కోరారు.ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫామ్ లో మ్యాపింగ్ అయినట్లు అయితే అన్ని వివరాలు సరిచూసుకొని సంతకం చేసి ఫోటోను అంటించి బిఎల్ఓలకు అందజేయాలన్నారు.మ్యాపింగ్ కాని వారు కూడా 2002 ఓటరు జాబితాలో పేరు చూసుకొని ఎన్యు మరేషన్ ఫామ్ పూర్తిగా నింపి అందజేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిపిఓ నరసింహా,బిఎల్ఓ రాజమణి,ప్రజా ప్రతినిధులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారు

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్



**మహేశ్వరం,జూన్27(జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచులు ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచులు,తమ గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేలా తీర్మానం చేయాలని నల్ల బ్యాడ్జీలతో శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే భారత్ ఫ్యూచర్ సిటీకి అత్యంత ప్రాధాన్యత పొందుతుందన్నారు.సిటీ నిర్మాణం చేపడుతున్న సమయంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి చెందాలంటే ఫ్యూచర్ సిటీలో విలీన తీర్మానాలను మండల అభివృద్ధి అధికారికి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య,ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్ యాదవ్,పాండు నాయక్, కొల్లపడకల్ గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్,ఉప్పుగడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చీపునుంతల ఉపసర్పంచుకు షోకాజ్ నోటీసు జారీ



**తలకొండపల్లి జూన్ 27(జనంసాక్షి):** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామ ఉప సర్పంచ్ గుమ్మడి రాజు,కు రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.చీపునుంతల గ్రామంలో గ్రామ సభ ద్వారా గుర్తించి చేయదలచిన పనులకు తీర్మానాలపై సంతకాలు చెయ్యకుండా,అభివృద్ధికి ఖర్చు చేసిన నిధుల విడుదలకు చెక్కులపై సంతకాలు చెయ్యకుండా,నిర్లక్ష్యం చేస్తున్న ఉప సర్పంచ్ గుమ్మడి రాజు పై గత నెలలో డిపిఓ కు గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు.దీంతో గత నెలలోనే గ్రామాన్ని సందర్శించిన డిపిఓ పంచాయితీ రికార్డులను,గ్రామంలో చేయదలచిన పనులను,తీర్మాన ప్రతులను పరిశీలించారు.అధికారిక నిధులు ఖర్చు చేయడంలో సర్పంచ్ కు ఉపసర్పంచ్ సహకరించడం లేదని నిర్ధారణకు వచ్చిన డిపిఓ సురేష్ మోహన్ శనివారం ఉప సర్పంచ్ గుమ్మడి రాజు,కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.గ్రామ అభివృద్ధికి,సర్పంచుకు ఎందుకు సహకరించడం లేదనే విషయాన్ని 7 రోజుల నుంచి 15 రోజులలోగా సరైన సమాధానం ఇవ్వాలని నోటీసు జారీ చేసినట్లు మండల అధికారులు తెలిపారు.

# వైరమ్యాలతో యువకుడిపై దాడి

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

### న్యాయం చేయాలని కోరిన బాధితుడి తల్లి బోయిని సంగమ్మ



**పెద్దేముల్ జూన్27(జనంసాక్షి)** ఇద్దరి వ్యక్తుల మధ్య ఉన్న వ్యక్తిగత వైరంతో ఓ యువకుడుని విచక్షణ రహితంగా కొట్టి దాడి చేసిన సంఘటన పెద్దేముల్ మండల పరిధిలో శనివారం జరిగింది. ఈ ఘటనపై బాధితుడు తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బోయిని సంగమ్మ అంజప్ప దంపతుల కుమారుడు రాంప్రసాద్ గత రెండున్నర సంవత్సరాలుగా పెద్దేముల్ గ్రామానికి చెందిన శోభారాణి దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శోభారాణి కుమారుడు వీరేశం, తన కుమారుడు రాంప్రసాద్ మధ్య వ్యక్తిగత వైరాలు ఉన్నందున ఈనెల 24వ తేదీన రాంప్రసాద్‌ను తాండూరులోని ఓ గెస్ట్ హౌస్ వైపు తీసుకెళ్లి దాడి చేశాడని తెలిపారు. దాడి విషయాన్ని ఎవరికైనా చెప్పిన పోలీసులకు ఫిర్యాదు చేసిన తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడని రాంప్రసాద్ తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈనెల 26వ తేదీన 9.30గంటలకు తన కుమారుడు గ్రామంలోని శంకర్ దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని తెలిపారు. ఆ వెంటనే మహేందర్, రవి అనే ఇద్దరు వ్యక్తులు రాంప్రసాద్‌పై కర్రలతో దాడిచేసి, బలవంతంగా కారులో ఎక్కించుకున్నారని, అనంతరం శోభారాణి కారులోకి మార్చి మార్గమంతా కొడుతూ తాండూరువైపు తీసుకెళ్లారని తెలిపారు. తన కుమారుడు రాంప్రసాద్‌ను అపహరించి, దాడి చేసిన నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తల్లి సంగమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సర్’ నమోదు కోసం వేముకుంట తారా నగర్ లో ఫారాల పంపిణీ



శేరిలింగంపల్లి, జూన్ 27 (జనంసాక్షి) : ప్రత్యేకసమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా చందానగర్ పరిధి వేముకుంట మరియు తారా నగర్ ప్రాంతంలో శనివారం ఉదయం బూతు లెవెల్ ఆఫీసర్(బిఎల్ఓ)లు ఇంటింటికి వెళ్లి స్థానికులకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరిగింది. పోలింగ్ స్టేషన్ నెం. 65, 119 పరిధిలోని ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు (దీూాలు) ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఓటరు జాబితాను ఖచ్చితమైనది, సమగ్రమైనది మరియు తాజా సమాచారంతో రూపొందించేందుకు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్లు అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయడానికి సహకరించడం జరిగింది. ఇందులో భాగంగా సహాయ ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు బూత్ లెవల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి, వాటిని సరైన వివరాలతో నింపి, అవసరమైన ధృవీకరణ పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అలాగే అర్హత పొందిన కుటుంబ సభ్యుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని, పేరు, చిరునామా, వయస్సు లేదా ఇతర వివరాలలో ఏవైనా మార్పులు ఉంటే వాటిని బూత్ లెవల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఖచ్చితమైన, తప్పులు లేని మరియు సమగ్ర ఓటరు జాబితా తయారీలో ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో కీలకమని ఏఈఆర్ఓ తెలిపారు. అందువల్ల బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వారికి సంపూర్ణ సహకారం అందించి, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

**నిషి ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ**

**ఫరూఖ్ నగర్ : జనంసాక్షి :** షాద్‌నగర్ పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన నిషి ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యాలయాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని సాయి రాథోడ్ ను శాలువాతో సత్కరించి అభినందించిన రవీందర్ యాదవ్, యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగంలో అడుగుపెట్టి ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. నిషి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్, నక్కల వెంకటేష్ గౌడ్, వీరేశం, కౌన్సిలర్లు జి.టి. వసంత శ్రీనివాస్, రఘునాథ్



యాదవ్, గోపాల్, నాయకులు ఎస్సీ శివ, మాజీ కౌన్సిలర్లు ఈగ వెంకట్రామ్ రెడ్డి, నంద కిషోర్, కానుగు అనంతయ్య, యువ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, అలాగే లక్ష్మణ్ నాయక్, రవి యాదవ్, రాజేందర్ సింగ్, హరిబాబు, సాయి రెడ్డి, జంగరాజ్, గుండు అశోక్, శ్రీధర్ చారి, నవీన్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంగ్లీష్ సబ్జెక్టు బోధన దరఖాస్తులు



**మర్పల్లి, జూన్ 27 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధన కోసం అనుభవం కలిగిన అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. ప్రమీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ గా విధులు నిర్వహించేందుకు ఎం.ఏ. ఇంగ్లీష్, బి.ఎడ్. అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. బోధనలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6304927998 నంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.



## మండలంలో నాలుగు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

**మర్పల్లి, జూన్ 27 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాలుగు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రహదారి మధ్యలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను మార్పిడి చేసే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కారణంగా మర్పల్లి, మర్పల్లి తండా, కోటమర్పల్లి, బుచ్చనపల్లి, దమస్తాపూర్, దమస్తాపూర్ తండా, గుర్రంగట్టు తండా, జాజిగూడబడి తండా గ్రామాలకు ఈ నెల 27వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ డీఈ బి. విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. పనులు పూర్తయిన వెంటనే సాధారణ నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



**బొంరాస్ పేట, జూన్ 27 (జనం సాక్షి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపల్ రోజా రాణికి స్థానిక మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు వినతిపత్రం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకు వస్తే అధ్యాపకుల కొరతతో వారి బోధనకు ఆటంకం కలుగుతుందని, సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రెగ్యులర్, గెస్ట్ అధ్యాపకులను నియమించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని యువకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు రామకృష్ణ గౌడ్, అనిల్, సలాం, నవీన్, రాఘవ్, ఇర్ఫాన్, ప్రకాష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించిన శేరిలింగంపల్లి జెడ్సీ

**శేరిలింగంపల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో శనివారం ఆయా పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు పంపిణీ చేసిన సర్ ప్రక్రియ ఫారాల పంపిణీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్(జోన్ ఈఆర్) ఆకస్మిక తనిఖీలలో భాగంగా పరిశీలించడం జరిగింది. ఈ క్రమంలో శేరిలింగంపల్లి వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ 96లో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా సమీక్షించి క్షేత్రస్థాయి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఫారాల పంపిణీ సజావుగా జరిగేలా, సకాలంలో పూర్తయ్యేలా అధికారులు మరియు ఓటర్లతో మంచి సమన్వయం ఏర్పరచుకొని ముందుకు సాగాలని శేరిలింగంపల్లి జోన్ ఈఆర్ఓ తెలియజేశారు. సమన్వయం, ఖచ్చితత్వం, సామర్థ్యం కనబరచాలని సంబంధిత బృందాలను ఆయన ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, ప్రతి ఫారం కచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని బిఎల్ఓ లకు శేరిలింగంపల్లి జెడ్సి సూచించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



**రాజేంద్రనగర్, జూన్27 (జనంసాక్షి) :** నార్సింగ్ సర్కిల్ పరిధిలోని గండిపేట గ్రామంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ వ్యాపార షెడ్లను శనివారం అధికారులు తొలగించారు. నార్సింగ్ డీసీపీ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, ఏసీపీ ప్రసీద, టీపీఓ రమేష్ సమక్షంలో భారీ పోలీసుల నడుమ ఈ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

**శంకర్‌పల్లి జూన్ 27 (జనం సాక్షి) :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి అతడు మృతిచెందాడు. శంకర్‌పల్లి సీఐ మీర్ ముదసిర్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులగూడ గ్రామానికి చెందిన గంజిగూడ రవి(27) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడు రోజుల క్రితం రవి మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య ఆలివేలు మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రవి శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పొలం వద్ద పురుగుల మందు తాగాడు అతనిని గమనించిన స్థానికులు వెంటనే అతని భార్యకు సమాచారం అందించారు. ఆలివేలు వెంటనే రవి ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మీర్ ముదసిర్ అలీ తెలిపారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 190వ అన్నదాన కార్యక్రమం



**శేరిలింగంపల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం 190వ అన్నదాన కార్యక్రమాన్ని గంగారంలోని ఫౌండేషన్ కార్యాలయంవద్ద ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపుగా 2వేల మంది అన్నార్తులు పాల్గొని అన్న వితరణను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం ఎంతో అద్భుతంగా ఉందని, ప్రతి శనివారం కచ్చితంగా తమకు ఓ పూట పట్టణం లభిస్తుందన్న భరోసా గత 189 వారాలుగా లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆకలితో అన్నదాన కార్యక్రమానికి ఎంతమంది వచ్చినా కాదనకుండా అన్నవితరాలను చేపడుతున్న హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు, చైర్మన్ కొండ విజయ్ కుమార్ అందరి ఆశీస్సులతో ఇలాంటి అన్నదాన కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడంపట్ల హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ కు వారు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబర్పేటలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రికగ్నైజేషన్ సర్వే



**అంబర్పేట జూన్ 28 (జనం సాక్షి) :** ఈనెల 25 నుండి ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రికగ్నైజేషన్ సర్వే వచ్చే నెల జూలై 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, అంబర్పేట మండల తాసిల్దార్ అన్వర్ హుస్సేన్ అన్నారు, శనివారం బి ఎల్ ఓ లు చేపట్టిన సర్ సర్వేలో పాల్గొని బిఎల్ఓ లకు తగు సూచనలు చేశారు, బిఎల్ఓ లు సంబంధిత ఫారాలను ఇంటింటికి వెళ్లి అందజేసి ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు, 2002 లో ఓటర్ లిస్టులో తమ పేరు ఉంటే మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు, ప్రతి ఓటరుకు ఒకటే ఓటు ఉండాలని డబల్ ఓట్లు ఉంటే వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు ఓటర్లకు సంబంధించి సమగ్ర సవరణ చేసి తుది ఓటర్ జాబితాను రూపొందించేందుకు బి ఎల్ ఓ( బూత్ లెవెల్ ఆఫీసర్ )ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఓటరు తప్పక పాల్గొని ఓటును కోల్పోకుండా చూసుకోవాలని అన్నారు ఈ మేరకు అంబర్పేట్ లోని ఎం సి హెచ్ క్వార్టర్స్, పూర్ణోదయ కాలనీలో బిఎల్ఓ లను,పత్రాలను పరిశీలించి తగు సూచనలు,సలహాలను ఇచ్చారు, వారి సందేహాలకు నివృత్తి చేశారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే బిఎల్ఓ లకి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని అన్నారు, బి ఎల్ వో లు వారి ఫోన్ నెంబర్లు ఫామ్ లో అందుబాటులో ఉంటాయని, కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే వారు కూడా చేసుకోవాలని తెలిపారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు నేడే పల్స్ పోలియో కార్యక్రమం

**అంబర్పేట్ జూన్ 27(జనంసాక్షి) :** నవజాత శిశువు నుండి ఐదు సంవత్సరాల వయస్సు వున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఈ పల్స్ పోలియో డ్రాప్స్ వేయించాలి. ఇప్పటికే టీకాలు అన్ని పూర్తయినప్పటికీ అదనపు డోస్ ఇవ్వడం వల్ల పోలియో వైరస్ రాకుండా ఉంటుంది. ఈ డ్రాప్స్ అంగన్వాడీ కేంద్రాలలో,ప్రభుత్వ పాఠశాలలో మరియు ప్రజలకు అందుబాటు ఉండే ప్రదేశాలలో నిర్వహిస్తున్నారు. ఈరోజు పల్స్ పోలియో డ్రాప్స్ వేసుకోని చిన్నారులకు మరుసటి రోజు 29, 30 తేదీలలో ఇంటి వద్దకు వచ్చి వేయడం జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో అధిక జనాభా ఉన్నందున జులై 1న కూడా మరో అవకాశం ఇచ్చి పల్స్ పోలియో డ్రాప్స్ అందించనున్నారు. ప్రతి తల్లిదండ్రులు కూడా ఈ సదవకాశాన్ని వినియోగించుకుని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడి వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలి.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం

## అన్ని ఏర్పాట్లు పూర్తి

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27 (జనంసాక్షి):** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఆదివారం (జూన్ 28) నిర్వహించనున్న పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు ఆమె వెల్లడించారు.మండల వ్యాప్తంగా మొత్తం 114 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయగా, ఐదేళ్లలోపు 39,509 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించారు. కార్యక్రమం పర్యవేక్షణ కోసం 10 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 3 మొబైల్ బృందాలు, 4 ట్రాన్సిట్ పాయింట్లు, 125 వ్యాక్సిన్ క్యారియర్లు మరియు అవసరమైన ఐస్ ప్యాక్‌లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.అలాగే మండలంలోని 7 హై రిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అక్కడి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, సూపర్వైజర్లు, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, జూన్ 28న ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా సమీపంలోని పోలియో బూత్‌లో పోలియో చుక్కలు వేయించాలని, ఇప్పటికే సాధారణ టీకాలు పొందిన పిల్లలకు కూడా ఈ చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# మల్లంపేటలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డు ఆక్రమణల తొలగించిన అధికారులు



**నిజాంపేట్, జూన్ 27( జనం సాక్షి) :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ లో రోడ్డు ఇరుపక్కల ఆక్రమణలపై శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగించారు. నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం రహదారులను పాదచారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దుండిగల్ సర్కిల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మల్లంపేట ఓఆర్ఆర్ (ఓ ఆర్ పి) ఎగ్జిట్ నంబర్ 4ఖ నుంచి మల్లంపేట దుండిగల్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి వరకు ఉన్న రహదారి వెంబడి అక్రమంగా నిర్మించిన ఫుడ్ స్టాల్స్ ఇతర ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం 32 అక్రమ నిర్మాణా ఫుడ్ స్టాళ్లను గుర్తించిన అధికారులు ఆక్రమణలు: తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లంపేట-బాచుపల్లి మార్గంలో సుమారు 1.5 కిలోమీటర్ల మేర రహదారిని ఆక్రమించి ప్రజా రవాణా కు అంతరా అంతరాయం ఏర్పడుచున్నందున వెంటనే ప్రజల సమస్య పరిష్కారానికి తొలగిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగావా ఇప్పటివరకు 24 ఆక్రమణలను అధికారులు విజయవంతంగా తొలగించారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే తొలగించనున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఎవరైనా ఎటువంటి అనుమతులు లేకుండా, రోడ్డు ఇరువైపులా ఇక నుంచి స్టాల్స్ ఏర్పాటు చేసిన సహించేది లేదని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రహదారిలో తలెత్తిన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో, దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ , ఏసీబీ శ్రీనివాస్ , టీపీఎస్ ముఖేష్ సింగ్ గారు, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో వైభవంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు

## రజిత కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

## సామూహిక చండీ హోమం, శ్రీచక్రార్చన ఘనంగా నిర్వహణ





**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో జరుగుతున్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు - ద్విదశాబ్ది ఉత్సవాలు రెండో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవారు రజిత కవచాలంకరణలో సర్వదేవతా స్వరూపిణిగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణను దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మూలమంత్ర హోమం, శ్రీచక్రార్చన, నవగ్రహ పాశుపత హోమం, భక్తుల విశేష భాగస్వామ్యంతో సామూహిక చండీ హోమం నిర్వహించారు. అనంతరం నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు వేదఘోషల మధ్య ఘనంగా జరిగాయి. హోమాగ్నుల దివ్య తేజస్సు, వేదమంత్రాల నినాదం, భక్తుల భక్తిపారవశ్యం ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. శనివారం సందర్భంగా అమ్మవారిని దర్శించి హోమాలు, పూజల్లో పాల్గొన్న భక్తులకు శనిదోష నివారణ, నవగ్రహ అనుగ్రహం, ఆరోగ్యం, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం, సకల కార్యసిద్ధి కలగాలని ఆలయ అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావుతో పాటు ట్రస్ట్ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలను శ్రీ మాతా నిమిషాంబ దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో, హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపి పీఠం సంచాలకత్వంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.

# అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ రూ.50 వేల విరాళం

**హయత్ నగర్, జూన్ 27 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ ఫేజ్-1లో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి ట్రస్ట్ తరఫున రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా జక్కిడి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవతో పాటు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మహోత్సవాలను విజయవంతం చేసిన ఆలయ కమిటీ సభ్యులు, జడ్జెస్ కాలనీ ఫేజ్-1 న్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు, భక్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ బంగారు పోచమ్మ ఆలయ కమిటీ, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, జడ్జెస్ కాలనీ ఫేజ్-1 న్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# సాయిబాబా కాలనీలో అండర్ డ్రైనేజీ సమస్యతో ప్రజల అవస్థలు

## మురుగు నీరు నిలిచి భరించలేని దుర్వాసన.. రోగాల భయం

**వికారాబాద్, జూన్ 27(జనంసాక్షి):** వికారాబాద్ మున్సిపాలిటీ 15వ వార్డు నర్సింగ్ గొలికర్ ఫంక్షన్ హాల్ సమీపంలో సాయిబాబా కాలనీలో గత మూడు నెలలుగా అండర్ డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చింది. మ్యాన్‌హోల్ పొంగిపొర్లడంతో మురుగు నీరు వీధుల్లోకి చేరి ఇళ్ల ముందే నిల్వ ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,మురుగు నీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, దోమలు అధికంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆరోపించారు.



తాత్కాలికంగా సమస్యను పరిష్కరించినా, కొద్ది రోజులకే మళ్లీ అదే పరిస్థితి నెలకొంటోందని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను పూర్తి చేసి, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సాయిబాబా కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



# ఆనాటి ప్రభుత్వానికీ నేటి ప్రభుత్వానికీ ప్రజలు తేడా గమనించాలి

**గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఆదాయ మార్గాలుగా మారాయి**
**ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం**
**నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతి లేకుండా ఇళ్లు అందజేస్తాం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు జూన్ 27(జనంసాక్షి) :** తాండూరు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో తాండూరు పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ర్యాండమైజేషన్ విధానం ద్వారా నిర్వహిస్తున్న డ్రా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మొత్తం 8,333 దరఖాస్తులు రాగా, అందులో 581 ఇళ్లు అందుబాటులో ఉన్నాయి, అర్హుల ఎంపికలో పూర్తిగా పారదర్శకత, న్యాయం ఉండాలన్న ఉద్దేశంతో ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం అని అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజా సేవ కోసం కాకుండా కొందరికి ఆదాయ మార్గాలుగా మారాయి. వార్డు సభ్యుల నుంచి కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నాయకుల వరకు కోటాలు, వాటాల పేరుతో అవినీతికి అవకాశం కల్పించబడింది. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన పరిస్థితులు గతంలో కనిపించాయి. సంక్షేమ పథకాల లక్ష్యం ప్రజలకు మేలు చేయడం కాకుండా, వాటి ద్వారా లాభం పొందడం అనే ఆలోచనకు ప్రాధాన్యం ఇచ్చారు. నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని కొందరికి కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. తాండూరు నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, వాటి నిర్మాణం వేగంగా కొనసాగుతోంది , ఇళ్లు పొందిన లబ్ధిదారులు "ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మాకు ఇల్లు వచ్చిందని చెప్పడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శన మన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకత్వం అధికారంలో ఉన్నప్పుడే నిజమైన ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రజలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం. నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇళ్లు అందించాలన్నదే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. గతంలో జరిగినట్లుగా సంక్షేమ పథకాలు కమిషన్లకు గురికాకూడదని ప్రజలు కోరుతున్నారు.దళిత బంధు" వంటి పథకాలను కూడా గతంలో కమిషన్లకు అమ్ముకున్నారని ప్రజల్లో అభిప్రాయం ఉంది. అందరి అభిప్రాయం ఒక్కటే -- నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతి లేకుండా ఇళు అందించాలి. అదే లక్ష్యంతోనే ఈ ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేయడం జరిగింది. ఇకపై పారదర్శకత, నిజాయితీ, అవినీతి రహిత పాలనతో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ఒక ఆదర్శంగా నిలుస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి , అడిషనల్ కలెక్టర్ లు ఉమాశంకర్ ప్రసాద్ , వెంకట చారి , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, పిడి హౌసింగ్ దశరథ్ సింగ్ , మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, అధికారులు, సానిక కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు యువ సాంఘిక్

**చేవెళ్ల, జూన్ 27 (జనంసాక్షి)** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు (ఆదివారం) నిర్వహించే యువ సాంఘిక్ కార్యక్రమానికి యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చేవెళ్ల ఖండ సంఘచాలక్ బిల్లపాటి కృష్ణారెడ్డి కోరారు. ఉదయం 7 గంటలకు చేవెళ్లలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గణవేష్ ఉన్న స్వయంసేవకులు సంఘ దుస్తుల్లో, మిగిలిన వారు సాధారణ దుస్తుల్లో హాజరుకావచ్చని, కార్యక్రమానికి 10 నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ రామకృష్ణ

**కాప్రా, జూన్ 27 (జనం సాక్షి ) :** విద్యుత్ మరమ్మతుల కారణంగా కుషాయిగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణ తెలిపారు.విద్యుత్ మరమ్మత్తులలో భాగంగా చెట్లు నరికే కార్యక్రమాన్ని సందర్భంగా కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అదేవిధంగా లెవెన్ కె.వి పద్మావతి విద్యుత్ ఫీడర్ పరిధిలోని తులసి హాస్పటల్ ఏరియా నిర్మల లాడ్జి తల్లూరి థియేటర్ ఏరియా ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు

## షాబాద్ ఎక్సైజ్ కార్యాలయాన్ని చేవెళ్లలోనే కొనసాగించాలి

**గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్**

**షాబాద్, జూన్ 27(జనంసాక్షి) :** షాబాద్ మండల ఎక్సైజ్ (ఎస్‌హెచ్‌వో) కార్యాలయాన్ని చేవెళ్ల నుంచి షాద్‌నగర్‌కు మార్చే ప్రతిపాదనను వెంటనే ఎక్సైజ్ శాఖ విరమించాలని షాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన షాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ... షాబాద్ మండలానికి గత ఐదు దశాబ్దాలుగా చేవెళ్లలోనే ఎక్సైజ్ (ఎస్‌హెచ్‌వో) కార్యాలయం కొనసాగుతోందని, ప్రస్తుతం దానిని షాద్‌నగర్‌కు మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నిర్ణయం అమలైతే మండలంలోని గీతా కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. షాబాద్ మండలం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోనే ఉండటంతో పాటు ఆర్డీవో కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, కోర్టు తదితర ప్రభుత్వ కార్యాలయాలు కూడా చేవెళ్లలోనే ఉన్నాయని గుర్తు చేశారు.

## మధుయాష్కి గౌడ్‌కు ఘన సన్మానం

**ఇంటి వద్ద విజయోత్సవ సంబరాలు**



**హయత్ నగర్, జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ జల మండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌ ర వా ధ్య క్షు లు మధుయాష్కి గౌడ్ ను శుక్రవారం బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన తెలంగాణ జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆ విజయానికి మార్గదర్శకత్వం వహిస్తూ యూనియన్‌కు నిరంతరం అండగా నిలిచిన మధుయాష్కి గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. డప్పు వాయిద్యాల నడుమ భారీ సంఖ్యలో తరలివచ్చిన యూనియన్ ప్రతినిధులు గజ మాలలు, పూల మాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన నివాసం వద్ద టపాసులు కాల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఒకప్పుడు విడివిడిగా ఉన్న ఉద్యోగ సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో మధుయాష్కి గౌడ్ కీలక పాత్ర పోషించారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి తదితరుల సహకారంతో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ, మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మెవా), ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్‌లను ఐక్యం చేసి ఐఎన్‌టీయూసీ అనుబంధంగా సంఘాన్ని బలోపేతం చేశారని తెలిపారు. ఈ క్రమంలో ఆరేళ్ల తర్వాత తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) గుర్తింపు సంఘంగా విజయం సాధించడం ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన యూనియన్ ప్రతినిధులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవణ్ కుమార్, సయ్యద్ అక్తర్ అలీ, ఎం. రాంచందర్, బి. శంకర్ ప్రకాష్, సయ్యద్ హాసిం, రమేష్, కృష్ణ ముదిరాజ్, రాములు ముదిరాజ్, లక్ష్మణ్ యాదవ్, ఏ. అశోక్, వి. కృష్ణ, వినోద్ గౌడ్, ఘోసే పాషా, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**వికారాబాద్ జిల్లా ఉద్యమకారుల పిలుపు**

**యాలాల,జూన్ 27( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం 3:00 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోని బాయి శ్రీనివాస్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంజయ్ గౌడ్,ఉద్యమకారులు ప్రకాశ్ గౌడ్,జిలాని, హేమంత్ కుమార్,ఇంద్రానగర్ ప్రకాష్ గౌడ్,మహేష్ కుమార్,నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**బొంపల్లి మాజీ ఎంపిటిసి రాఘవాపురం రాములు**



**దోమ జూన్ 27 జనంసాక్షి :** ఎస్ఐఆర్ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బొంపల్లి మాజీ ఎంపిటిసి రాఘవపురం రాములు తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో బి ఎల్ వో తో కలిసి ఇంటింటికి ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలు అధికారులు చేపడుతున్న సవరణలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో డెత్ డబుల్ ఓట్లు చాలా ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులకు నూతన ఓటరును నమోదు చేయించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా చేపట్టి అందుబాటులో ఉంచాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చూపిన ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసినందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా అవగాహన లేని ప్రజలకు దరఖాస్తు ఫారాలను అధికారులు నింపి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షేర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పక్రియను పారదర్శకంగా రూపొందించేందుకు సహకరించాలి

**గ్రామ సర్పంచ్ కే .శ్రీనివాస్**



**కొడంగల్, జూన్ 27 (జనం సాక్షి) :** ఓటరు సమగ్ర సర్వేలో భాగంగా ఉడిమేశ్వరం గ్రామంలో ఓటర్లకు ఇంటింటికి వెళ్లి గ్రామ సర్పంచ్ కే. శ్రీనివాస్, బీఎల్ఓ రమేష్ కుమార్ ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన పౌరులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి బీఎల్ఓకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాను ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో చౌకీదార్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**చేవెళ్ల, జూన్ 27 (జనంసాక్షి)** ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న చౌకీదార్ (వాచ్‌మన్) పోస్టు భర్తీకి అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సిటిడబ్ల్యూ వార్డెన్ విజయలక్ష్మి కోరారు. చేవెళ్ల మండల మున్సిపాలిటీ పరిధిలోని వసతి గృహంలో నివసిస్తున్న బాలికల భద్రత, సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నియామకం చేపడుతున్నట్లు ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు విద్యార్హత, అనుభవ ధ్రువపత్రాలతో పాటు అవసరమైన పత్రాలను జతచేసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వసతి గృహ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించే మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు గడువులోపు దరఖాస్తు చేసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వార్డెన్ విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### తహసిల్దార్ మునీరుద్దీన్



**మోమిన్ పేట జూన్ 27 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని మోమిన్ పేట తహసిల్దార్ మునీరుద్దీన్ పేర్కొన్నారు శనివారం మోమిన్ పేట మండల కేంద్రంలోని ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ ఏనుయుమరేషన్ పారాలను బిఎల్ఓ కు పూర్తిచేసి అందించాలని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులు ప్రతి పౌరునికి ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసే విధంగా సహకరించాలని ఆయన సూచించారు గ్రామంలో ఎవరైనా మరణించిన ఎడల వారి ఓట్లను తొలగించడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు ఒకరికి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తిచేసే ఇవ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ గౌడ్ డిసిసి కార్యదర్శి సిరాజుద్దీన్ బజాజ్ పటేల్ బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పరి పల్లిలో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ



**శామీర్ పేట్, జూన్ 27(జనం సాక్షి ) :** ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు శామీర్‌పేట్ డివిజన్‌లోని ఉప్పరపల్లి వార్డు ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ పోలమొల్ల బాలేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,మాజీ ప్రజాప్రతి నిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని డ్వాక్రా మహిళలకు ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి మరియు సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం,వారికి సామాజిక భద్రత కల్పించడం లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గురుజాల బాబు,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్,తదితర నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

### జాతీయ అధ్యక్షుడి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### ఔషాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు



**ఘట్‌కేసర్, జూన్ 27 ( జనం సాక్షి ):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, ఎదులాబాద్ డివిజన్‌లోని ఔషాపూర్ గ్రామం రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన సందర్భంగా నిర్వహించనున్న ముఖ్య సమావేశానికి విస్తృత ఏర్పాట్లు కొనసాగుతు న్నాయి. ఈ ఏర్పాట్లను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయపతాకం ఎగుర వేస్తుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడు తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన రాష్ట్ర బీజేపీకి నూతన ఉత్సాహాన్ని తీసుకువస్తుందని, ఈ సమావేశంలో కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై కీలక మార్గదర్శనం అందించనున్నారని తెలిపారు. తెలంగాణలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుమలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోన శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతే లక్ష్యం

### ఆర్టీఐ చట్టం అమలుకు కలెక్టర్‌కు వినతి!

**మోమిన్ పేట జూన్ 27 ( జనం సాక్షి)** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్, గౌరవ అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్ మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సూర స్రవంతి ఆదేశాల మేరకు శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం--2005 (ఆర్టీఐ)ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చట్టబద్ధంగా, సకాలంలో అందించడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారి సానుకూలంగా స్పందించి, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ వికారాబాద్ జిల్లా కార్యవర్గ గౌరవ సభ్యులు మహమ్మద్ గౌస్, గుజ్జరి మహేందర్, దుర్గం చెరువు గోపాల్, పాత్లోత్ పెంట్యా, కొండనోళ్ల నరేష్, మోతే అశోక్, మర్పల్లి ప్రభాకర్, బీజే గోరెప్ప, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు

### మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్

### ప్రతి అర్హుడూ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి



**జవహర్ నగర్, జూన్ 27 (జనంసాక్షి):** ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు సవరణ) ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు . శనివారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని 543, 544, 545 పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. ఓటరు సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు, నమోదులు చేయించుకోవాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ రోజుకు ఒక బూత్ పరిధిలో సుమారు 50 ఇళ్లను సందర్శించి ఓటర్లకు వివరాల పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఆ పత్రాలను పరిశీలించి అవసరమైన వివరాలను బీఎల్ఓలకు అందించాలని సూచించారు. ఒకవేళ బీఎల్ఓలు ఇంటికి వచ్చిన సమయంలో కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోతే సంబంధిత ఓటరు పేరును జాబితాలో గుర్తు చేస్తారని, అలాంటి వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆగస్టు నెలలో ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫామ్-8 సమర్పించి తమ ఓటు హక్కును భద్రపరచుకోవచ్చని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆనాటి ప్రభుత్వానికీ నేటి ప్రభుత్వానికీ ప్రజలు తేడా గమనించాలి

**గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఆదాయ మార్గాలుగా మారాయి**

**ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం**

**నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతి లేకుండా ఇళ్లు అందజేస్తాం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు జూన్ 27(జనంసాక్షి) :** తాండూరు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో తాండూరు పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ర్యాండమైజేషన్ విధానం ద్వారా నిర్వహిస్తున్న డ్రా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మొత్తం 8,333 దరఖాస్తులు రాగా, అందులో 581 ఇళ్లు అందుబాటులో ఉన్నాయి, అర్హుల ఎంపికలో పూర్తిగా పారదర్శకత, న్యాయం ఉండాలన్న ఉద్దేశంతో ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం అని అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజా సేవ కోసం కాకుండా కొందరికి ఆదాయ మార్గాలుగా మారాయి. వార్డు సభ్యుల నుంచి కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నాయకుల వరకు కోటాలు, వాటాల పేరుతో అవినీతికి అవకాశం కల్పించబడింది. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన పరిస్థితులు గతంలో కనిపించాయి. సంక్షేమ పథకాల లక్ష్యం ప్రజలకు మేలు చేయడం కాకుండా, వాటి ద్వారా లాభం పొందడం అనే ఆలోచనకు ప్రాధాన్యం ఇచ్చారు. నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని కొందరికి కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. తాండూరు నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, వాటి నిర్మాణం వేగంగా కొనసాగుతోంది , ఇళ్లు పొందిన లబ్ధిదారులు "ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మాకు ఇల్లు వచ్చిందని చెప్పడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శన మన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకత్వం అధికారంలో ఉన్నప్పుడే నిజమైన ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రజలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం. నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇళ్లు అందించాలన్నదే ఈ విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. గతంలో జరిగినట్లుగా సంక్షేమ పథకాలు కమిషన్లకు గురికాకూడదని ప్రజలు కోరుతున్నారు.దళిత బంధు" వంటి పథకాలను కూడా గతంలో కమిషన్లకు అమ్ముకున్నారని ప్రజల్లో అభిప్రాయం ఉంది. అందరి అభిప్రాయం ఒక్కటే -- నిజమైన అర్హులకు ఎలాంటి అవినీతి లేకుండా ఇళు అందించాలి. అదే లక్ష్యంతోనే ఈ ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేయడం జరిగింది. ఇకపై పారదర్శకత, నిజాయితీ, అవినీతి రహిత పాలనతో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ఒక ఆదర్శంగా నిలుస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి , అడిషనల్ కలెక్టర్ లు ఉమాశంకర్ ప్రసాద్ , వెంకట చారి , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, పిడి హౌసింగ్ దశరథ్ సింగ్ , మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, అధికారులు, సానిక కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**వికారాబాద్ జిల్లా ఉద్యమకారుల పిలుపు**

**యాలాల,జూన్ 27( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం 3:00 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా ఉద్యమకారులు పిలుపునిచ్చారు.

# జర్మనీ విద్యా పర్యటనకు డా.కాంచనలత ఎంపిక

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గర్వకారణం**

**వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్ బాబు**



**చేవెళ్ల, జూన్ 27 (జనంసాక్షి)** శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. సిహెచ్. కాంచనలత జర్మనీలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక విద్యా పర్యటనకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 28 నుంచి జూలై 6 వరకు జరిగే ఈ పర్యటనలో ఆమె జర్మనీలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణ కేంద్రాలను సందర్శించి ఉన్నత విద్యా విధానాలు, పరిశోధన, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, అంతర్జాతీయ సహకార అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. డా. కాంచనలత ఎంపిక ఆమె విద్యా నాయకత్వానికి, విద్యా నాణ్యత పెంపుదలకు చేస్తున్న కృషికి దక్కిన విశిష్ట గుర్తింపని రమేష్ బాబు పేర్కొన్నారు. జర్మనీలో పొందే అనుభవం కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యా అవకాశాల కల్పనకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు డా. కాంచనలతకు ఘన అభినందనలు తెలియజేస్తూ పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆమె సాధించిన ఈ గుర్తింపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల ప్రతిష్ఠను మరింత పెంచిందని వారు పేర్కొన్నారు.



# దేవరయాంజాల్‌లో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన

**శామీర్ పేట్, జూన్ 27(జనం సాక్షి ) :** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం శనివారం రోజు శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవర యాంజాల్ లో 154, 157 పోలింగ్ బూత్‌ల పరిధిలో స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ, సూపర్‌వైజర్లు,బూత్ లెవల్ అధికారులు ,బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొని ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి ఓటరు తన వివరాల ధృవీకరణపై అప్ర మత్తంగా ఉండాలని సూచించారు.బీఎల్ఓలు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేసి తిరిగి సమర్పించాలని కోరారు.ఫారం సమర్పించక పోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.ఓటు హక్కు ప్రజా స్వామ్యం లో అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్త పేర్లు నమోదు చేయించడం, వివరాల్లో సవరణలు, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణ వంటి అంశాలపై కూడా ప్రజలకు వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం లో ఏఈఆర్ఓ పి.మధుసూదన్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, సూపర్‌వైజర్లు రజీత, జానీ,బీఎల్ఓలు ఎం.ఆనంద్, సి. వీరమణి, డి. సరస్వతి, కరిమునిషా, జి. రాధ, బీఎల్ఏలు జి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని,బీఎల్ఓలు అందించే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా పనిచేయాలి

**బూత్ స్థాయి ఏజెంట్లకు దిశానిర్దేశం చేసిన డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్**

**ఘట్‌కేసర్, జూన్ 27 ( జనం సాక్షి ):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ అన్నారు. శనివారం ఎంఎంసీ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, ఎదులాబాద్ 7వ డివిజన్‌లోని ఘనపురం, లింగాపూర్, ఇందిరా నగర్, పకీర్ టేక్య తండా ప్రాంతాల్లో ఉన్న 332, 333 పోలింగ్ కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని బూత్ స్థాయి ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ప్రజలకు అవగాహన కల్పించడంలో సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, ప్రతి అర్హ ఓటరికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు వేముల శంకర్ గౌడ్, నానావత్ సురేష్ నాయక్‌తో పాటు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో బూత్ స్థాయిలో అప్రమత్తత అవసరం



**ఘట్‌కేసర్, జూన్ 27 (జనం సాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎంఎంసీ పరిధిలోని ఘట్‌కేసర్ 6వ డివిజన్‌లో శనివారం పలు పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న సవరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ శాసనసభ్యుడు చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్‌లను సందర్శించిన బండారి శ్రీనివాస్ గౌడ్, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించి బూత్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎలాంటి లోపాలు, పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. పార్టీ ఎన్నికల బూత్ ఏజెంట్లు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్న తీరును ఆయన అభినందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలకమని, సవరణ ప్రక్రియ విజయవంతం కావడంలో ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్ రావు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.